# గొడుగులాంటి మనిషి

ఇదిగో... ఇది మా ఊరు, ఇది గాంధీగారి పేరు పెట్టి ఖాళీగా వదిలేసిన స్థలం. గాంధీపార్కు! వెలుతుర్లో పిల్లలకీ, చీకట్లో పెద్దలకీ ప్రకృతి ధర్మాలు నెరవేర్చుకునేందుకు ఉపయోగపడుతోంది. పార్కెప్పుడూ శవంలేచిన యిల్లులా బావురుమంటూ వుంటుంది.

పదడుగులు వేశారుగదా, ఇది జమ్మిచెట్టు, ఇదే బోస్‌చౌక్, బోసు బొమ్మేదని అడక్కండి. ఒకప్పుడు ఉండేదే. తరాలు మారుతున్నాయి కనుక మరొకరికి చోటు చేయాలని బోస్‌గారు ఎలిమెంటరీ స్కూలు పాత సామాన్ల గదికి వెళ్ళిపోయారు.

ఇట్టా నడిస్తే ఇది పడమర వీధి, వీధి చివర చెఱువు. చెఱువు ఒడ్డున పెద్ద మర్రి. దాన్ని ఆనుకుని శివాలయం. శివాలయానికి తొంభై డిగ్రీల్లో రామాలయం. ఆ రెండినీ కలిపే గట్టు మీది రోడ్డున ఆచార్లయిళ్ళు. ఈ గట్టుకి ఊరి వాళ్ళ దాహం బాగా తెలుసు. రామాలయం గోపురంనుంచి పరచుకుని వుంది తూర్పువీధి.

తూర్పు వీధిలో రామాలయం నుంచి నడుస్తుంటే... కుడివైపు రెండోయిల్లు చెన్నయ్యది. ఒంటినిట్టాడి తాటిపాక.

నాకు ఊహ తెలిసినప్పట్నుంచీ చెన్నయ్య మకాం ఇక్కడే.

చెన్నయ్యకి ప్రత్యేకమైన వృత్తేమీ లేదు. జనపనార పేనుతాడు. నులక తయారు చేస్తాడు. మంచాలు అల్లుతాడు, ఉలీ, బాడిశా పట్టి నాగళ్ళూ, బండి చక్రాలూ తయారు చేస్తాడు. మంత్రాలు వేస్తాడు. గచ్చాకు పుచ్చాకు వైద్యం చేస్తాడు. పిల్లలకి శతకాల పద్యాలు చెప్తాడు. పెద్దబాల శిక్ష వల్లెవేయిస్తాడు. వేమన్నలూ, పోతన్నలూ... చెన్నయ్య గొంతులో వొద్దికగా వొదిగిపోతారు.

చెన్నయ్య వయస్సు డెబ్భై పైమాటే. కాయకష్టం చేసి రాటుదేలిన దేహం.

దుబ్బుజుట్టు, దట్టంగా మీసాలు. గోసిపోసి కట్టిన అరపంచె. కంటెమెడ చొక్కా దాని చేతులు మోచేతి కిందికీ ముంజేతి పైకీ వుంటాయి.

కూర్చుండే వాళ్ళుంటే చాలు. చెన్నయ్య కబుర్లు కబుర్లు కావు. ఇంగ్లీషుదొరల గుర్రపు స్వారీ దగ్గర్నుంచీ అల్లూరి జీవితందాకా ఎన్నెన్నో కథలూ, గాథలూ చెప్తాడు. గళం విప్పితే ఖంగుమంటుంది. కపిలవాయి రామనాథశాస్త్రి పాటల్నుంచీ సియ్యాస్సార్ కీర్తనల మీదుగా, ఘంటసాల, భానుమతి వరకూ... అందరి స్వరాలూ పలుకుతాడు.

చెన్నయ్య ఎక్కణ్ణుంచి వచ్చాడో, ఏవూరో ఎవరికీ తెలీదు. ఎవరేం అడిగినా నవ్వి వూరుకుంటాడు.

సాయంత్రం సూర్యుడు నారింజ పండులా చెరువులోకి దిగిపోతున్నాడు. చెన్నయ్య కబురుచేస్తే వెళ్ళాను.

"ఇతను మా ఊరినుంచి వచ్చాడు" అని వో పాతికేళ్ళ యువకుణ్ని చూపించాడు. "నేను ఇక్కడున్నట్టు తెలుసుకుని వచ్చాట్ట". నేను ఆశ్చర్యంగా చూశాను.

"అవును. చనిపోయిన కరణం గారికి తప్ప మనవూర్లో ఇంకెవరికీ తెలీదు, నా గురించి. ముప్పైఏళ్ల క్రితం జరిగిన ఘటనలు. ఇన్నాళ్ళకిన్నాళ్ళకి మళ్లీ ఇవాళ...." ఆగాడు. చిత్రంగా తల విదిలించాడు.

"మధుట పేరు. మా తమ్ముడి కొడుకుల్లో చివరివాడుట. వీడిపైన ఒక పిల్ల, ఆ పిల్లకి ముందు రవి. వాళ్ళు నాకు తెలుసు"

...ఆ రాత్రి, మధువచ్చిన పని గురించి చెప్పాడు చెన్నయ్య. తాను అసలు మా ఊరెలా వచ్చాడో కూడా చెప్పాడు. చెన్నయ్యకు ఒక్కడే తమ్ముడు. అప్పచెల్లెళ్లు లేరు. అంతా ఒకే గూటిలో కాపరం. ఒకరోజు ఏదో మాటల మధ్యలో మరదలు అన్నది, "మీ అయ్య నీకు పెద్ద చదువునిచ్చాడు. మీ తమ్ముడికి చేతిలో నాగలి పెట్టాడు. మీరెట్టాగైనా బతకగలరు. ఉన్న పొలం తమ్ముణ్ని చేసుకోనిస్తే... మీకు పోయేదేం లేదు" అంతే, చెన్నయ్య ఆ ఇంటినుంచి, వూరు నుంచి బయటికి

వచ్చేశాడు. నాకు ఆశ్చర్యం, ఉద్వేగం కలిగాయి. చెన్నయ్యపట్ల ఆరాధనా భావం గుండె అంతా నిండింది.

"మధు పనిని గురించి ఏమంటావ్?" అడిగాను.

ఇవ్వాళ... తమ్ముడి కొడుకు దస్తావేజుల మీద సంతకాలకోసం వచ్చినా, పల్లెపట్నంగా మారి పొలాలూ, తోటలూ బంగారాన్నిస్తున్నాయన్నా.. ఆ సంపదకోసం మళ్లీ చలిస్తాడా?! మరదలి మాటకి... అరవై ఎకరాల పొలాన్నీ, పదెకరాల తోటనీ తృణప్రాయంగా వదిలేసి రాత్రికి రాత్రి తన ఊరికి వీడ్కోలు చెప్పిన చెన్నయ్య.

క్షణాల తర్వాత అన్నాడు, చెన్నయ్య. "నాభాగానికొచ్చేది యిప్పుడు నా వాళ్లకి అక్కర్లేదు. అనుభవించాల్సిన సమయంలో నా అయివేజు వాళ్లని ఆదుకుంది. ఇప్పుడు నాకొచ్చే భాగం మన స్కూలుకిద్దామనుకున్నా".

జీవితం కొందర్ని మారుస్తుందిట. కానీ, కొందరు జీవితాన్నే మారుస్తారని తెలుస్తోంది.

ఇది కలా అంటే కలకాదు. ఎదురుగా... మహా పర్వతం! దాని క్రిందుగా నేను చిన్న గులకరాయిని! అవును. నేను ఆ స్కూల్లో టీచర్ని!!!

(పల్లకి వినూత్న వారపత్రిక 3 మార్చి 1993.)

***

